



అద్దంలో ఇరవై మూడోసారి తన మొహం చూసుకున్నాడు మూర్తి. 'ఉహూ! లాభం లేదు!' అని నిట్టూర్చాడు. ఎన్ని వంకరలు పెట్టి, ఎన్ని కోణాలు మార్చి చూసినా, తనమొహంలో అందం కనబడే సూచనలు లేవు; రావు; కలగవు. 'బ్యూటీ' అనే బిరుదు పక్కింటి అమ్మాయిలు తనకు ప్రసాదించారంటే, వాళ్ళ తప్పేముంది! ఈ ముఖంలోకి అందం రావాలంటే, ప్లాస్టిక్ సర్జరీ తప్ప వేరే గత్యంతరం లేదు. అందుకు బహుశా విదేశాలకు వెళ్ళవలసి ఉంటుంది. అది తను బి. ఏ. పాసయితేగాని సాధ్యంకాదు. బి. ఏ. పాసవడానికి ఆరునెలలు వ్యవధి ఉంది. ఈలోపల, ఆ అమ్మాయిల గోల నెలా భరించడం ?— అప్పుడే, మూర్తికి ఎదురైన సమస్య.

పక్కింటి అమ్మాయిలంటే, కొత్తగా ఆ బంగళాలో అద్దెకు దిగిన ఇంజనీరుగారి అమ్మాయిలు. అస లా బంగళామట్టుకు మూర్తి తండ్రిది. అందులో ఒక గదిమాత్రం మూర్తి కోసం ఉంచి, తక్కినదంతా ఆ ఇంజనీరుగారికి అద్దె కిచ్చేశారు, మూర్తి తండ్రైన కోదండ రామయ్యగారు, ఆయన ఉద్యోగరీత్యా మరో ఊర్లో ఉండవలసి రావడంవల్ల.

శ్రీకాకుళం కాలేజీలో మూర్తిని ఎరుగని



# టార్జాన్ ప్రేయసి

రంగారావు

వాళ్ళు లేరు. హాకీ, క్రికెట్, ఫుట్‌బాల్ మొదలైన ఆటల్లో అతనిది అందెవేసిన చెయ్యి. ఆరడుగుల పొడవూ, బలిష్ఠమైన కండలు తిరిగిన శరీరం పెట్టిన భగవంతుడు, మూర్తి ఆకారానికి, ఆఖరిసారి మెరుగులు దిద్దడంలో పొరపాటుచేసి, అ ప్రక్కన ఖాళీగా పడిఉన్న ఒక చింపాంజీ తలను తీసుకొచ్చి అతికించేశాడు. ఇన్నిరోజులనుంచీ ఆ విషయం మూర్తి నంతగా బాధించలేదు. కాని, ఈ ప్రపంచంలోకల్లా అందమైన ఒకే ఒక అమ్మాయి— తనరూపం గురించి మాటిమాటికీ వెక్కిరించి మరొక అమ్మాయితో కలిసి తనను ఏడిపించడం, మూర్తికి చాలా బాధ కలిగించింది. ఆమె, ఇంటి పెరుగారి రెండో అమ్మాయి, సుజాత. ఆమె పదహారేళ్ళ, అప్సరస. మూర్తికి కవిత్వం రాకపోవడం వల్ల ఆమె అందంయొక్క వివరాలు ఆంధ్ర మహాజనులకు లభించలేదుకాని, లేకపోతే ఆమె కట్టుకునే పరికిణీ ఓణీల రంగులదగ్గర్నుంచి, ఆ పొడుగాటి జడా, ఆ విశాలమైన కళ్ళూ, ఆ ఎర్రటి పెదవులలో ఉన్న అందంగురించి, స్వయంగా ఒక నూరుపద్యాలు రాసి, అచ్చొత్తించి, ఆ పుస్తకాల్ని అందరికీ ఉచితంగా పంచి పెట్టి ఉండేవాడు, మూర్తి! భగవంతుడు చేసిన మరొక లోపం, మూర్తికి కవిత్వం రాకపోవడం. మూర్తికే గనక కవిత్వం వస్తేనా......?

అస లిదంతా ఎలా ప్రారంభమైందంటే, తన కోపంతో అట్టే దిట్టబడిన గదిలో కూర్చొని, ప్రొద్దున్నపూట మూర్తి చదువుకుంటున్నాడు. సరిగ్గా ఆగది కెదురుగా ఉన్న మరొక గది కిటికీ వద్ద నిల్చుని ఇద్దరు అమ్మాయిలు మాట్లాడుకుంటున్నారు. వారి మాటలు మూర్తి చెవులో పడ్డాయి.

"ఈ ఊళ్లో 'జూ' కూడా ఉందిలాగుందే."

"అవునేవ్, మనకింత దగ్గరలో 'జూ' ఉండడం, చాలా మంచిది సుమా! కాస్త మనకీ ఊసుపోతుంది."

మూర్తి తలెత్తి చూశాడు. ఆ సమయానికి మూర్తి బుర్రలో ఇంకా ఆ మాటల అర్థం స్ఫురించలేదు. ఇద్దరు, జిగేల్‌మని మెరిసిపోతున్న అమ్మాయిలు కన్పించారు.

"మనిషేనే ....!" అంది అందులో చిన్నమ్మాయి.

"అవును సుమా, టార్జాన్ అయిఉండాలి!" అని ఇద్దరూ కిలకిలా నవ్వుకున్నారు. ఆ నవ్వును చూసేసరికి మూర్తికి చరాలుమని కోపం వచ్చింది. వాళ్ల మాటలకు అర్థం బోధపడింది. వెక్కిరిద్దామనుకున్నాడు. పేర్లు పెడదామనుకున్నాడు. కసితీరా ఏడిపిద్దామనుకున్నాడు. కాని ఆ నిముషంలోనే, ఆ చిన్నమ్మాయి మాటిగా తనవేపు చూసి, తల తిప్పేసుకోవడం, మూర్తి 'ఐస్' అయిపోవడం జరిగిపోయింది. మరి ఆ అమ్మాయిని ఏడిపించ బుద్ధెయ్యలేదు, మూర్తికి. ఎందుకంటే, ఏ యువకుడైనా, ప్రేమించడమో, ఏడ్పించడమో ఏదో ఈ రెండిట్లో, ఒకపనే చెయ్యగలడుగాని, రెంటినీ చెయ్యలేడు. అయినా, అలా ఆ అమ్మాయివైపు చూస్తూ ఉండిపోయాడు. గాని, మరో ఆలోచనే అతనికి తట్టలేదు.

తరువాత మూర్తికి ఆ అమ్మాయిలలో పెద్దమ్మాయి పాడటం విన్పించింది. మూర్తి మెల్లిగా లేచి, తలుపు వేసేసి, బయట వరండామీదకు వెళ్లాడు. ఆ అమ్మాయిలు ఏవో మాటలు మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు.

"టార్జాన్ మీద ఒక పద్యం రాయవే"

"అబ్బ, అంత 'ఇన్‌స్పైరింగు' గా లేదు, రూపం."

"పోనీ ఒక గేయమో, గీతమో రాయి."

"అలాగేలే. అన్నట్టు — 'కోతినుండి మనిషి' అన్న గేయం చదివావా? ఎంత బాగా వర్ణించాడే."

"అవునవును. చాలా బావుంది."

గదితలుపు తాళం వేసి, కాఫీ త్రాగడానికి బయల్దేరాడు మూర్తి. ఈ ఇద్ద రమ్మాయిలకీ సంగీతం, సాహిత్యం, అంటే చాలా యిష్టంలాగుంది, అనుకున్నాడు. పైగా చాలా గడుసు అమ్మాయిలులాగ ఉన్నారు. తను తల్చుకుంటే, మూడు నిముషాల్లో వాళ్లని కళ్లనీళ్ల పర్యంతం చెయ్యగలడు. అమ్మాయిల వెనక్కాలవెళ్తూ, వాళ్లను కావలసినంత అల్లరిపెట్టగల సమర్థత ఉంది.

89—వ పేజీ చూడండి

# టార్జాన్ ప్రణయం

23-వ పేజీ తరువాయి

కాని, ఏం లాభం? తను ఆ, చిన్నమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయికి కళ్ల నీళ్ళ తెప్పించడం తనవల్ల కాదు.

వాళ్ళన్న మాటలకి మూర్తికి ఉద్రేకం వచ్చినా, అందులో నిజం కొంత లేకపోలేదు. తనకి అందం లేదు. పెద్ద తెలివి తేటలు కూడా లేవు. లేకపోతే ఇరవై రెండేళ్లకి బి. ఏ లోనే కూచోడ మేమిటి? ... అంటూం టారు, వాళ్ల నాన్నగారు, ఇక ఉన్నదల్లా, కండలు తిరిగిన శరీరం.

రెండు రోజులు ఆ అమ్మాయిల వేళాకోళాలు మౌనంగా భరించాడు. వారి గురించి కొద్దిగా వివరాలు సేకరించాడు. ఆ యిద్దరు అమ్మాయిల పేర్లూ విజయా, సూజాతా. పెద్దమ్మాయి వయస్సు ఇరవై, పెళ్లి కూడా అయిపోయింది. రెండవ అమ్మాయి మెట్రిక్‌కు కడుతోంది. ఇద్దరూ తెగ పత్రికలూ, పుస్తకాలూ చదువు తారు. పాటలు బాగా పాడతారు. అంతేకాకుండా వారి ఊరు వచ్చి కొద్దిరోజు లైందో లేదో వారింటికి పలుగురైదుగురు స్నేహితురాళ్ళు రావడం, ఏవో పాటలు పాడడం, పుస్తకాల గురించి కబుర్లు చెప్పడం గమనించాడు మూర్తి. ముఖ్యంగా నిర్మలా దేవి, వారింటికి రావడం మూర్తికి ఆశ్చర్యం వేసింది. నిర్మలాదేవి గొప్పగాయకురాలని మూర్తికి తెలుసు. ఆమె రేడియోలో ప్రోగ్రాము లిస్తుంది. అటువంటి సుప్రసిద్ధ వ్యక్తులు వాళ్లింటికి వస్తుంటే వాళ్లకి తనలాంటి వాళ్లమీద ఏం గౌరవ ముంటుంది? అని ఆలోచించాడు మూర్తి. తనూ ఆటల్లో గొప్పవాడే. 'టెస్ట్ మాచెస్' లో ఎప్పుడైనా పాల్గొనే అవకాశం లభిస్తుంది. కాని... అంతవరకు? .... అంతవరకు, అనామధేయుడే.

అలా, అద్దంలో చూసుకుంటూ ఆలోచిస్తూ ఉండగానే మూర్తికి ఒక మెరుపులాంటి వూహ తట్టింది. 'తను కవిత్వం రాస్తేనో' .... ! షేక్స్ పియరుగా(రి) బహుశా అద్దం చూసుకుంటున్న సమయంలోనే, 'హేమ్లెట్' రాయాలనే వూహ తోచిందేమో! అందువల్ల అతనా పుస్తకం రాయడం, మూర్తి బి. ఏ. లో ఆ పుస్తకాన్ని, (అంటే పుస్తకం కాదనుకోండి, దాని నోట్సుని— ఎందుకంటే ఈ రోజుల్లో టెక్స్ట్ పుస్తకాలు చదవడం ఫాషను కాదని మూర్తికి బాగా తెలుసు!) చదవడం జరిగింది. అద్దంచూసుకుంటున్నప్పుడు పుట్టే ఊహలు చాలా గొప్పవి. ఒక్కొక్కప్పుడు తెల్లవార్లూ నిద్ర లేనప్పుడు, అద్దం చూసు కుంటే దెయ్యాల కథలూ, హేమ్లెట్ లాటి పుస్తకాలూ జ్ఞాపకం వస్తాయి. అప్పుడు రచ యితలు మళ్లీ కొన్ని కొత్తకథల్నీ, డిటెక్టివ్ సాహిత్యాన్నీ సృష్టించచ్చు. అలాటి విలువైన తలం పులలోకి చేరిందే, మూర్తి యొక్క కవిత్వ తలంపు. ఆ ఒక్క ఆలోచనే కాదు. వరుసగా మరికొన్ని ఆలోచనలు కూడా మూర్తికి వచ్చాయి. ఎలా రాయడం? దేనిగురించి వ్రాయడం? అసలు కవిత్వ మంటేనేమిటో తనకు తెలియదే!—(అంటే "అక్క రకురాని చుట్టము ...." వగైరా, వచ్చుననుకోండి!) అయినా సరే, ఎలాగో రాయాలి. రాసి వరండా మీద పచార్లు చేస్తూ చదవాలి. అప్పుడు ఆ అమ్మాయి, "అబ్బ! ఎంత బావున్నాయండీ మీ పద్యాలు!" అని ......

"ఒరేయ్! ఏ లోకంలో ఉన్నావురా? అద్దం ముందు కూచొని, ఏమిట్రా వెర్రి వెర్రి చూపులు? ఎంత పిలిచినా పలుకవేం?" అని వీపు తట్టిన, రామం కేకలతో మళ్లీ మామూలు ప్రపంచంలో పడ్డాడు, మూర్తి.

రామాన్ని చూడగానే, మూర్తికి మరొక అయి డియా తట్టింది. 'ఒరేయ్! నేను కవిత్వం రాయాలి.! రాసి తీరాలి!" అన్నాడు.

"శాంతించు, బ్రదర్! శాంతించు! నన్ను గుర్తుపట్టే ఉంటావు. నీ బాల్య స్నేహితుణ్ణి! కంగారు పడక విషయ మేమిటో చెప్పు!"

---

"ఈ హోటల్లో భోజనం ఎప్పుడూ ఒకే మాదిరిగా వుం టుంది." అప్పుడే హోటలునుంచి బయటికివస్తున్న పరంధామయ్య గారు అన్నారు.

"మరే! ముక్క పురుగు కూడా మారటం లేదు" అని తడుముకోకుండా సమాధాన మిచ్చాడు గోలేశ్వరరావు.

శివకామయ్య (చీపురుపల్లి)

---

"నాకు మతిపోలేదు. నువ్వు కంగారు పడ క్కరలేదు."

"లేకపోతే నీకు కవిత్వ మేమిట్రా? ఎవడ్రా చెప్పాడు నీకీ పాడు సలహా? నయం. ఇంకా మొదలెట్టావు కాదు., నిన్ను వాల్తేరు దాకా మొయ్యలేక మేము చచ్చి ఉందుం."

మూర్తి దిగులుగా మొహం పెట్టేశాడు. "రామం! నేను ప్రేమించానురా! ఆ ప్రేమను వ్యక్తం చెయ్యడానికి కవిత్వం రాయాలిరా! నువ్వు నన్ను అపార్థం చేసుకుంటే ఎలారా?"

"అదా, చిట్టి తండ్రీ! అలా, అసలు విషయం చెప్పు. సరే, అయితే, నీ కవిత్వానికి మార్గమేదో వెతుకుదాం, ముందు హోటల్ ప్రకాశ్‌కు పద" అన్నాడు రామం. బరువైన హృదయంతో మూర్తి లేచాడు. ఇద్దరూ బయల్దేరారు.

ఇడ్లీ సాంబారు అధ్యాయం లోంచి కాఫీ పారా యణ చేసేలోపల, అసలు విషయమంతా మూర్తి రామానికి చెప్పి, "నీ ఎరికలో ఎవరైనా పెద్ద కవి ఉంటే చెప్పరా. కొద్దిగా 'టిప్స్' నేర్చు కుంటాను. అతనివద్ద" అన్నాడు.

రామం కొద్దిగా ఆలోచించాడు. "చూడూ ఈమధ్య డి. సరయూరాణి అని ఒక పేరుతో పత్రికలలో కొన్ని కథలూ, పద్యాలూ పడు తున్నాయి చూశావా? ఆ సరయూ రాణిది మన వూరే, తెలుసా?"

"ఆడవాళ్ల పరిచయం మన కెందుకురా? ఎవరైనా మగవాళ్ళని చూడు. వాళ్లతో స్నేహం చెయ్యడానికి వీలుంటుంది."

"సరయూరాణి అంటే స్త్రీ అనుకున్నా వేమిటి?"

"కాదా? చంపేశావ్! ఆ కథలూ, ఆ వర్ణనా చూసి కేవలం స్త్రీయే అనుకున్నాను. మగవాడే నేమిట్రా?"

"నేనూ నీలాగే అనుకున్నాను మొదట్లో. అసలు సరయూ రాణి కథల్లో దాంపత్య ప్రణయం, స్త్రీయై వర్ణించడం, అత్యంత ఉన్నత స్థాయికి వెళ్లింది. ఆ భావాలూ, ఆ మాటలూ వాటిలోని లాలిత్యం, మాధుర్యం, స్త్రీ హృదయంలోంచి, కలం లోంచి తన్నుకొచ్చాయనను కున్నాను. కాని అది అతని 'పెన్‌నేమ్.'

"హా! హతవిధీ! అతని అసలు పేరేమిటిరా?"

"డి. సూరన్న పంతులు."

"ఓక్!" అని గొంతుకలో ఏదో అడ్డం పడినదాన్ని సర్దుకున్నట్టు అభినయించాడు మూర్తి. రామం ఏమిటని? అడిగాడు. మూర్తి, "అబ్బే, ఏం లేదురా. ఆ రచనలు చదువుతూంటే ఓ అందమైన ఇరవైయేళ్ల అమ్మాయి, సన్నని నడుమూ, చిలిపి చూపులూ, కొంటె నాలకంతో కన్పిస్తూంటుంది కళ్లముందర. కాని ...."

"నాకూ సరిగ్గా అలాగే అనిపించిందిరా. అసలు కీర్తి గడించినవా రెవరైనా అంతే అనుకో. వాళ్ల రచనలూ, పాటలూ, రేడియోలో విని వాళ్లెంతో అందంగా ఉంటా రనుకుంటాం. అంతెందుకు, "శతభిషం" గారని ఒకాయన గొప్ప కావ్యాలు రాశాడు. ఆయన రచనలు చదివి, చాలా అందంగా ఉంటాడనుకొన్నాం. ఒకసారి ఆయన ఫోటో గూడా పడింది. అది చూసి కొంత నిరుత్సాహం చెందా ననుకో. కాని అతనికి మన ఊరులో సన్మానం జరిగినప్పుడు చూశాను. బాపూ కార్టూన్‌లో పెళ్లికొడుకులా ఉన్నాడు. నా ఆశా భంగాన్ని ఆపుకోలేక ఆయన దగ్గరకు వెళ్లి 'మీ ఫోటో చూసి మీరు కొంచెమైనా బావుంటా రను కున్నానండీ' అనేశాను. దానికి ఆయన నవ్వుతూ 'ఆ ఫోటోగ్రాఫరు నాకు చాలా అన్యాయం చేశాడు.' అన్నారు. అలాగే ఉంటుందిరా ఎప్పుడో మనం చూడవలసింది. హృదయ సౌందర్యం కాని భౌతిక రూపం కాదు" అని రామం చెప్తుంటే మూర్తి దృష్టి హోటల్ ప్రకాశ్‌లో అలంకరణార్థం ఉంచబడ్డ అద్దంవైపు మళ్లింది.

ప్రతివిషయానికీ రెండువైపు లుంటాయి. ఒకవైపు చెడ్డ ఉంటే, మరొకవైపు మంచి ఉంటుంది. అద్దంలో మూర్తికి కన్పించింది 'టార్జన్' రూపం. అయితేనేం—అది కేవలం

భౌతిక రూపం మాత్రమే! అది చూసి పక్కింటి అమ్మాయిలు వెక్కిరించవచ్చు!— కాని ఆ రూపంలో ఉన్న హృదయ సౌందర్యమో ?—అది వాళ్ళు గ్రహించిననాడు .... ? తనని సుజాత తప్పక ప్రేమించి తీరుతుంది. కాని హృదయ సౌందర్యం వెలికి రావాలి—అంటే కవిత్వం రాయాలి—అప్పుడు ఆ సుజాత, అది చదవాలి!

"ఒరేయ్, మరి ఆ—సరయూరాణిని—అంటే సూరన్న పంతుల్ని ఎప్పుడు పరిచయం చేస్తావు ?"

"ఇవాళ సాయంకాలమే. అతను నాగావళి బ్రిడ్జి దగ్గర నిలబడి, తన కవిత్వానికి ఆవేశం తెచ్చుకుంటూంటాడు. ఆ సమయంలో వెళ్దాం" అని రామం లేచాడు. బిల్లు మూర్తి చెల్లించాడు. అది మూర్తికి మామూలే. స్నేహితులందరి కాఫీ హోటలు ఖర్చులూ, అతనే భరిస్తాడు.

సాయంకాలం నాగావళి బ్రిడ్జి దగ్గర, ఎర్రగా సన్నగా పొట్టిగా, రేగిన జుట్టుతో, మాసిపోయిన పంటూ చొక్కాలతో, పాతికేళ్ల వయసులో ఉన్న ఒక వ్యక్తికి, రామం, మూర్తిని పరిచయం చేశాడు.

"ఈయనే సరయూ రాణి పేరుతో రాసే సూరన్న పంతులుగారు."

"నమస్తే!" "నమస్తే!"

మూర్తికి, ఆ రూపం చూడగానే అదేదో జోక్ జ్ఞాపకం వచ్చింది. (అందులో ఒక పెద్ద మనిషి, ఒక కుర్రాణ్ణి చూసి "నువు శుభ్రంగా మొహం కడుక్కొని, కాళ్ళూ, చేతులూ, మట్టి లేకుండా కడుక్కొని వస్తే పావలా బహుమతి ఇస్తాను" అంటాడు. ఆ కుర్రాడు అలాగే శుభ్రంగా కడుక్కొని వచ్చి, ఆ పెద్దమనిషి పావలా ఇయ్యబోతే "మీరే ఉంచుకోండిసార్. అది మీరు క్షవరం చేయించుకుని, గడ్డం గీసుకొని వస్తే, నే నిచ్చే ప్రజెంటు" అంటాడు. మొట్ట మొదటిసారి ఆ పెద్దమనిషి, ఆ కుర్రాడూ కలుసుకున్నప్పటి దృశ్యం స్ఫురిస్తుంది. సూరన్న పంతుల్ని చూస్తే. అయితేనేం ?—హృదయ సౌందర్యం జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించాడు మూర్తి.)

"మీ రచనలు చాలా బావుంటాయి. ముఖ్యంగా —మీ—'కైవల్య' అన్న కథలో, ఆ—స్త్రీ యొక్క భావాలు వర్ణించారు చూశారా—ఆహా!—ఏమి బాగా వర్ణించారండీ!"

సూరన్న పంతులు చిరునవ్వు నవ్వాడు. "అది ఒక హాలీవుడ్ సినిమా స్టారు జీవిత చరిత్ర లోంచి గ్రహించాను. దాన్ని మన వాతావరణానికి అనుగుణంగా మార్చేశాను."

మూర్తికి సూరన్న పంతులు జీనియస్ అనిపించింది. ఎక్కడి హాలీవుడ్—ఎక్కడి శ్రీకాకుళం—ఎక్కడి కైవల్యం ? అద్భుతం! అనుకున్నాడు.

తరువాత ముగ్గురూ హోటల్‌కు వెళ్లారు. సూరన్న పంతులు కవిత్వం ఎంత బాగా రాయగలడో, టిఫిన్ కూడా అంత బాగా తినగలడు. మూర్తి సంతోషంతో బిల్లు చెల్లించాడు. సూరన్న పంతులి దగ్గర కవిత్వం గురించి కొన్ని మాటలు విన్నాక, రాత్రి మెల్లిగా రాముణ్ని, మూర్తి న్యూ కాలనీలో ఉన్న మూర్తి గదికి వెళ్లారు. సూరన్న పంతులు చాలా గొప్ప కవి. అని అనుకున్నారు. రామం దాన్ని బలపరుస్తూ, "ఒరేయ్! రచయితలు, తమకు జీవితంలో ఏది లభించలేదో దానిని గురించి చాలా బాగా రాస్తారు. ఉదాహరణకి సూరన్న పంతుల్ని చూడు. అతను ప్లీడరు గుమాస్తాగా నెలకి అరవై రూపాయలు గడిస్తూ, చాలా దారిద్ర్యంతో బాధపడుతున్నాడు. అందుకని, ధనిక సమాజాన్ని, కార్లూ, బంగళాలూ, వజ్రాల హారాలూ మొదలైన వాటిని తెగ వర్ణిస్తాడు. అసలా ఆ 'థీరీ' వలననే—ఈ తను సరయూ రాణి అవునా ? కాదా ? అన్న సందేహం అప్పుడప్పుడు కలిగినా—అతనే సరయూరాణి అనే నిర్ణయానికి వచ్చాను." అన్నాడు. మూర్తి కూడా ఆ సంగతి ఒప్పుకున్నాడు.

---

"ఇతడు నిజంగానే నీపళ్ళు రాలగొట్టాడంటావా?" జడ్జి ఫిర్యాదిని నిగ్గతీసి అడిగాడు.

"నిజమేనండీ! వాడు పట్టి దొంగవెధవ. కదుల్తున్న పళ్ళు అలాగే ఉంచి శుభ్రంగా ఉన్న పళ్ళు కాసినీ రాలగొట్టేశాడు" అతడు మొరపెట్టుకున్నాడు.

---

ఒక వారం రోజులు సూరన్నపంతుల్ని ప్రొద్దున్నా, సాయంకాలం హోటల్‌లో కలుస్తూ గులాబీజాం, మైసూర్‌పాక్‌ల్ని ఆరగిస్తూ అతను బోధించే కవిత్వ సూత్రాలను అర్థం చేసుకున్నాడు మూర్తి. ఈ వారంలోనూ పాతిక రూపాయలదాకా, సూరన్న పంతులు, మూర్తి వద్ద చేబదులు కూడా వాడాడు.

ఆరోజు ఆదివారం. సుజాత ఒకర్తె కూచొని తన గదిలో—ఇంద్రధనస్సు—పత్రిక చదువుతోంది. వరండాలో పచార్లు చేస్తున్న మూర్తి, విజయ లేకపోవడం, సుజాత, ఒకర్తె కూచొని చదువుకోవడం చూసి, మూర్తి ఆమెను పలకరించడానికి నిశ్చయించాడు.

"ఏమండీ!" అని పిలిచాడు. సుజాత అతనిని చూసి లేచి నుల్చుంది. "రండి. నాన్నగారింట్లో లేరు. ఒక అర గంటలో వస్తారు. అలా కూచోండి" అంది మర్యాదగా.

మూర్తి తను వచ్చింది నాన్నగారి కోసం కాదనీ, పత్రిక కోసమనీ చెప్పాడు. సుజాత ఏం పత్రిక ? అని అడిగింది. ఇంద్ర ధనుస్సు, అను పత్రిక కావాలనీ అందులో, సరయూరాణి అన్న తన స్నేహితుడే కొందరు పద్యాలు రాస్తాడనీ చెప్పాడు.

"ఏమిటి ? సరయూరాణా ? మీ స్నేహితుడా ?" అని ఉలిక్కిపడింది సుజాత.

"అవును. ఆ పేరు చూసి స్త్రీ అనుకొని ఉంటారు, మీరు. కాని అతని 'పెన్ నేమ్' అది. అసలు పేరు సూరన్న పంతులు."

సుజాత తెల్లబోయింది. మూర్తి ఆమె మాత్రం ఆశ్చర్యపర్చగలిగినందుకు చాలా సంతోషించాడు. లేకపోతే తన గురించి, ఏమి ఉండో ?

"అసలు నా స్నేహితులు చాలామంది కవులు ఉన్నారు. సరయూరాణి నా బెస్టు ఫ్రెండ్" అని చెప్పి, ఎఫెక్టు కోసం "రామం అని ఇంకో ఫ్రెండున్నాడు. అతనూ రాస్తూంటాడు. మరి.... ఇంకా .... ఇంకా .... శరభిషం గారని—ఆయనా నాకు తెలుసు. ఇలా బోలెడు కవులున్నారు. వాళ్ళందరూ నన్ను చూడందే ఒక్క నిముషం ఉండలేరు. నేను ప్రక్కని కూచోపోతే వాళ్ళు కాఫీయే త్రాగరు." అని చాలా ముఖ్య విషయాలు చెప్పేశాడు మూర్తి.

సుజాత మొహంలో ఒక చిరునవ్వు ఉదయించి అణగారి పోయింది. "మీకు కవిత్వం అంటే చాలా యిష్టం. అనుకుంటాను. మిమ్మల్ని చూసి ...."

"టార్జాన్‌లా ఉన్నా ననుకున్నారు—"

"సారీ! క్షమించండి!"

"ఫరవాలేదు. కానీ, కవులలో మీరు చూడవలసింది భౌతిక రూపం కాదు. వారి హృదయ సౌందర్యం చూడాలి."

"నిజం చెప్పారు."

"అవును. చాలామంది, గొప్ప కళాకారులు, కావాలని భౌతిక రూపం, వికారంగా చేసుకుంటారు. అంటే జుత్తు పెంచేసుకుని, బట్టలు మాపేసుకునీ, గడ్డం పెంచుకొనీ, అసహ్యంగా తయారవుతారు. అప్పటికిగాని హృదయసౌందర్యం బయటికి రాదు."

"అలాగా ? నాకు తెలియదు."

"సరయూరాణిని చూస్తే మీ రాశ్చర్యపోతారు. అతను ఎంత అసహ్యంగా ఉంటాడో వూహించలేరు."

సరయూరాణి పేరెత్తినప్పుడల్లా, సుజాత తన మొహం ప్రక్కకి తిప్పేసుకోవడం మూర్తి గమనించాడు. దాన్నే పోర్వలేనితనం అంటాగని తెలుసుకున్నాడు, రామం ద్వారా, తరువాత.

"అంతేకాక మరొక విషయం. రచయితలు తమకు ఏది, అనుభవంలో ఉండదో, దాని గురించే రాస్తూ ఉంటారు."

"అంటే ?"

"అంటే, చూడండి, కైవల్య—అన్న కథలో సరయూరాణి—ఆ ధనిక సమాజం గురించి ఎలా వర్ణించాడో, కారూ, బంగళా, విలువైన నగలూ—వాటి గురించి, దానికి కారణం, అతను అరవై రూపాయలు తెచ్చుకొనే గుమాస్తా అవడమే. అదే అతను ఒక గజెటెడ్ ఆఫీసరయితే అట్లా రాయలేడు."

"అబ్బా! మీకు చాలా విషయాలు తెలుసునే. అయితే మీరూ కవిత్వం రాస్తారా ?"

"ప్రయత్నం చేస్తున్నాను." అన్నాడు. ఇంతలో ఇంజనీరుగారు రావటం, ఇతర విషయాలు మాట్లాడటంతో కవిత్వ ప్రసక్తి ముగిసింది. కాని, తరువాత, సుజాతకీ, మూర్తికీ మాట్లాడుకోవడానికి చాలా అవకాశాలు లభించాయి. విజయ, అత్తవారి ఊర్కైన బెజవాడ వెళ్లడంవల్ల, మూర్తికి సుజాత స్నేహం లభించింది. పత్రికలూ, పుస్తకాలూ, రెండు రోజుల్లో అటునుంచి యిటూ, ఇటునుంచి అటూ మారడం మొదలెట్టాయి.

మూడోరోజు ప్రొద్దున్న, సుజాత, మూర్తి గదివద్దకు వచ్చి, "తొమ్మిగి గంటలకు, బెజవాడలో రేడియో కవిసమ్మేళన ఉంది. అది వినండి. నేను కూడా వింటాను. తరువాత నేను నాన్నగారితో శ్రీకూర్మం వెళ్తాను. సాయంకాలం మాట్లాడుకుందాం, ఈ కవిసమ్మేళన గురించి" అని చెప్పి వెళ్ళింది.

మూర్తికి సుజాత అలా చెప్పి వెళ్లడం, ఆమెకు తనమీద ఉన్న అభిమానమే అన్పించింది. తనొక కవినని అప్పుడే ఆమె చాలా గౌరవిస్తోంది. పైగా తనకూ పెద్ద కవులంతా చాలా ముఖ్య స్నేహితులాయె. ఇంక ఆమె తనను గురించి గొప్పగా భావించడంలో సందేహ మేముంది ? ఆ భావమే ప్రేమగా మారచ్చు .... అబ్బ! సుజాతే గనక తనని ప్రేమిస్తే .... ?

గడియారం టంగున తొమ్మిది కొట్టింది. వెంటనే రేడియో వేశాడు. "ఆల్ ఇండియా రేడియో విజయవాడ కేంద్రం నుంచి ప్రసారిత మవుతున్న కవి సమ్మేళనం వింటారు. ఇందు పాల్గొనువారు, శ్రీ శతభిషంగారూ, శ్రీమతి డి. సరయూరాణి ...." అంటూంటే రేడియోలోంచి వచ్చే ఆ మాటలకు మూర్తి విభ్రాంతు డయ్యాడు. శ్రీమతి సరయూరాణి .... ఇదేమిటి ? తను వినడం పొరపాటు కాదుకదా ? మళ్లీ శ్రద్ధగా విన నారంభించాడు. ముందర, శతభిషంగారు తమ రచనల్ని చదివారు. తరువాత శ్రీమతి సరయూరాణి, ఒక గేయాన్ని చదువ నారంభించింది. స్వచ్ఛమైన ఆడగొంతుక. పైగా చాలా ఆవేశంతో చదువుతోంది. అంతేకాక తరువాత

# టార్జాన్ ప్రణయం

ఆమె—తను రచించిన ఒక భావగీతం పాడింది. అది తను మునుపు విన్నట్లు కూడా మూర్తికి తోచింది. అదవగానే మళ్లీ, అనౌన్సరు "ఇంత వరకూ మీరు శ్రీమతి డి. సరయూరాణిగారి కవిత్వం విన్నారు. తరువాత శ్రీ...." అని చెప్పడం కూడా విన్నాడు. మూర్తి, అచేతనుడై పోయాడు. ఎంత మోసం ? సూరన్న పంతులు ఎంత దగా చేశాడు ! అలా ఆలోచిస్తూ, యాంత్రికంగా కిటికీలోంచి చూశాడు. సుజాత తలిదండ్రులతో కారెక్కుతోంది. ఆమె తనవైపుచూసి కొంటెగా నవ్వటం గమనించాడు. కారుకదిలిపోయింది. రేడియో ఆపేసి మూర్తి బయల్దేరాడు.

నాగావళి బ్రిడ్జి దగ్గర, ఇన్స్పిరేషన్‌కోసం షికారు చేస్తున్న సూరన్నపంతులు, మూర్తి ఒక్క ఉదటులో వచ్చి తన చొక్కా కాలరు పట్టుకొని, "ఒరేయ్! నువ్వు వేషా లేస్తావుట్రా నాదగ్గర ?" అనడంచూసి తబ్బిబ్బైపోయాడు.

"అబ్బెబ్బె ! లేదు .... లేదు !" అని సూరన్నపంతులు అంటూంటే మూర్తి వాడిని రెండు లెంపకాయలు కొట్టాడు. "నేనే సరయూరాణినని దగా చేస్తావుట్రా ? పద ! నా రూముకు పద ! నీ సంగ తేమిటో కనుక్కుంటాను." అన్నాడు మూర్తి, తమ చుట్టూ జనం చేరడం గమనించి. దిక్కుమొహం వేసి సూరన్నపంతులు మూర్తి వెనకాల నడవడం మొదలెట్టాడు.

మూర్తి రూములో సూరన్నపంతులు తనది తప్పైపోయింది క్షమించమని, మూర్తి రెండు కాళ్లూ పట్టుకొని ఏడ్చేశాడు. తను కూడా కొద్దిగా కవిత్వం రాస్తాననీ, అందువలన, ఎవరి తోటో పొరపాటున తనే సరయూరాణినని అన్నాననీ, ఆ అబద్ధాన్ని నిలబెట్టుకోవడానికి ఇలా నటించానని అన్నాడు. అంతే దీనత్వానికి దిగిన సూరన్నపంతుల్నేమీ చెయ్యలేక పొమ్మన్నాడు మూర్తి.

సాయంకాలం చీకటి పడినా, లైటు వెయ్యకుండా తనగదిలో ఆలోచిస్తూ కూచున్న మూర్తికి, బయట, కారాగడం, అందులోంచి సుజాతా, తల్లీ దిగి ఇంట్లో కెళ్లడం, మళ్లీ కారు ఎక్కడికో వెళ్లిపోవడం కన్పించింది.

కొద్దినిముషాలు పోయాక "అరె! చీకట్లో కూచున్నారేం ?" అంటూ సుజాత తన గదిలోకి వచ్చి స్విచ్చి వెయ్యడం చూశాడు. ఆమెతో మాట్లాడడానికి కూడా అతనికి ధైర్యంలేదు. సరయూరాణిగురించి తన మాటలు అబద్ధం అయిపోవడం, కవిత్వంగురించి తన ఊహలు తప్పయిపోవడంవల్ల, ఆమె తన హృదయసౌందర్యం గుర్తిస్తుం దనుకోవడం వట్టి తెలివితక్కువ. ఎక్కడినుంచో నూతులోంచి మాట్లాడినట్లు, "మిస్ సుజాతా మీరు నన్ను క్షమించాలి. నా ఫ్రెండు నన్ను మోసంచేశాడు. అందువల్ల నేను మీతో అబద్ధమాడుతున్నట్లు తెలియక అబద్ధ మాడాను. సూరన్నపంతులు సరయూరాణి కాదు" అన్నాడు.

"ఛీ ! దానికేంలెండి. ఆ సంగతి నాకు ముందే తెలుసు. పాపం మీకు కవిత్వమంటే ఉండే యిష్టంవల్ల మోసపోయారు."

ఆమె సానుభూతి మూర్తికి చాలా బలం ఇచ్చింది.

"అసలు నేను కవిత్వం నేర్చుకుందా మను కున్నాను."

"ఎందుకు మీరు హఠాత్తుగా కవిత్వం నేర్చుకోవా లనుకున్నారు ?" అని అడిగింది సుజాత.

ఆ లైటు వెల్తురులో ఆమె అపురూప సౌందర్యం, మరింత ప్రకాశవంతంగా కన్పించింది మూర్తికి. అతనిహృదయంలో ప్రేమ, నాగావళికి వరదలొచ్చి పొంగినట్లు, పొంగింది.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నా ప్రేమ వెలిబుచ్చడానికే, కవిత్వం నేర్చుకుందా మనుకున్నాను. మీరు లేకపోతే నాకు ఈ జీవితమే వద్దు. మిస్ సుజాతా నేను వట్టి టార్జాన్‌లాంటి వాడినని మీ రనుకోవచ్చు ...."

"లేదు. నేనూ మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అంది సుజాత.

"ఆఁ !" అని తను కూర్చొన్న కుర్చీలోంచి లేచి ఆమె వద్దకు వెళ్లి, ఆమె సిగ్గుతో వంచిన తలను పైకెత్తి "నిజమేనా ! అయితే—మా నాన్నకు ఉత్తరం రాస్తాను" అన్నాడు.

"మానాన్నగారు అప్పుడే రాసేశారు" అని వెళ్లిపోబోయింది సుజాత. మూర్తి ఆమెను వెనక్కి పిల్చాడు, చిన్న మాట మాటాడాలని. "ఏమిటది ?" అంది, సుజాత. మూర్తికి ఏం మాట్లాడాలో తోచలేదు. గబుక్కున ఒకప్రశ్న జ్ఞాపక మొచ్చింది. అది ఇందాకటినుంచి అతని మనస్సులో మెదులుతోంది. సిగ్గుతో, పారిపోదామని ప్రయత్నిస్తున్న సుజాతను ఆపాలని ఉందతనికి ప్రేమగురించి మాట్లాడితే తిరిగి జవాబివ్వకపోవచ్చు. అందుకని మూర్తి "సరయూరాణి, సూరన్నపంతులు కాదని ముందేమీ కెలా తెలుసు ?" అని అడిగాడు.

సుజాత నవ్వుతూ "మా అక్కే సరయూరాణి ! మేము ఆమెను సరదాకి 'విజయ' అంటాం కాని, ఆమె అసలు పేరు సరయూరాణి. ఆపేరు నచ్చక మాబావగారు విజయ అని పెట్టుకున్నారు" అని వెళ్లిపోయింది.

# రు. 1000 నవలలపోటీ

రచయితల కోరికపై ఈ పోటీ గడువు 16-5-62 వరకు పొడిగిస్తున్నాము. మిగిలిన నిబంధనలు వెనుక ప్రకటించినవే.

సంపాదకుడు.